క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 13వ తేదీన (శనివారం) విద్యుత్ లైన్‌ల మరమ్మతు పనులు చేపడుతున్నందున కర్నూలు నగరంలోని వివిధ ఏరియాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సంబంధిత విద్యుత్ అధికారులు ప్రకటించారు. క్యాంపస్ సెక్షన్ డీ2 సబ్ డివిజన్ పరిధిలోని మద్దూర్‌నగర్, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సాయి వైబవ్ నగర్, చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రినగర్, బృందావన్ నగర్, మారుతీనగర్, అరుందతి నగర్ పరిసరాలు, రెవెన్యూ కాలనీ, శ్రీరామ్‌నగర్, మారుతి మెగా సిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మినగర్, కమలానగర్, టెలికామ్ నగర్, గఫార్‌నగర్, ప్రశాంతి నగర్, పుడ్‌కార్పొరేషన్ ఏరియా, కిసాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, మాధవనగర్, సీ–బి క్యాంపులు, గాయత్రీ ఎస్టేటు, లక్ష్మీనగర్ ఏరియా, ఓల్డ్‌టౌన్ సెక్షన్ పరిధిలో మొత్తం ఓల్డ్ ఏరియా, జొహరాపురం, ఇందిరమ్మ బిల్డింగ్స్, జొహరాపురం హౌసింగ్ బోర్డు జమ్మిచెట్లు ఏరియా,ఎస్టేటు సెక్షన్ పరిధిలో ఇండస్ట్రియల్ ఎస్టేటు, అబ్బాస్ నగర్, క్రిష్ణానగర్, రామకృష్ణానగర్, రామచంద్ర నగర్, గుత్తి పెట్రోలు బంక్ ఏరియా, శరీన్‌నగర్, కల్లూరుతో పాటు పందిపాడు, లక్ష్మీపురం, దూపాడు, పెద్దటేకూరు, చిన్నటేకూరు, తడకనపల్లి, బస్తిపాడు, పుసులూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సంతోషనగర్, సెంట్రల్, బళ్లారి రోడ్డు, పవర్ హస్ సెక్షన్ల పరిధిలోని కాలనీల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా నాట్య మండలి జిల్లా కార్యాలయం ప్రారంభం

కర్నూలు కల్చరల్: ప్రజా నాట్య మండలి జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ ప్రారంభించారు. స్థానిక కేకే భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ కళాకారులకు కార్యాలయం ఉండటం సంతోషకరమన్నారు. నూతన నైపుణ్యాలతో కళారూపాల తయారీకి ఈ కార్యాలయం ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

సెలవురోజుల్లో కౌంటర్ల ఏర్పాటు

కర్నూలు (టౌన్): సెలవు రోజుల్లోనూ నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్ను వసూళ్ల కేంద్రాలు పనిచేస్తాయని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏకమొత్తంలో పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ వర్తిస్తుందని ఆయన తెలిపారు. రెండో శనివారం, ఆదివారం కూడా పన్ను కౌంటర్లు పనిచేస్తాయని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితులకు నగదు సాయం చేస్తున్న ముస్లిం పెద్దలు

కల్లూరు: స్థానిక అబ్బాస్ నగర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బ్రహ్మయ్య ఆచారికి కాలనీవాసులు అండగా నిలిచారు. ముస్లిం కమ్యూనిటీకి చెందిన పలువురు కలిసి రూ. 75,500 ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ పెద్దలు ఫారూక్ బాష, ఇర్షాదుల్ హఖ్, ఎజాజ్ అంజద్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమాభివృద్ధి

- వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి
- కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
- నగరంలో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమానికి శ్రీకారం



వృద్ధుడిని ఓటు అభ్యరిస్తున్న ఇంతియాజ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న 12వ వార్డు వాసులు

కర్నూలు (టౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమాభివృద్ధి జరిగిందని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డితో కలిసి నగరంలో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 18 వ వార్డు జొహరాపురంలోని ఇందిరమ్మ కాలనీ, 42 వ వార్డు పరిధిలోని చల్లావారి వీధిలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఇంటింటికీ చేసిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుతం జగనన్న పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ఇళ్ల వద్దే ప్రజలకు అవసరమైన సేవలు అందజేస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగన్ సర్కారు ప్రజలకు మేలు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలన నచ్చి ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఎన్నికల్లో ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కర్నూలుకు అడ్డగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇంతియాజ్‌ను గెలిపించి మూడోసారి పార్టీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. 18 వ వార్డు నాయకులు నాగరాజు, రమణ, నాగేశ్వరరావు, డేవిడ్, శేషు, నారాయణ రెడ్డి, గౌడ్,42 వవా ర్డు ఇన్‌చార్జ్ కాశిరెడ్డి శ్వేతా పాల్గొన్నారు.

12వ వార్డు నుంచి 100 మంది పార్టీలో చేరిక

'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన విధానాలు నచ్చి ఐఏఎస్ హోదాకు రాజీనామ చేసి పార్టీలో చేరా. ఎన్నికల్లో ఓటేసి ఆదరిస్తే..అండగా నిలబడుతా'నని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ నగర కార్యాలయంలో 12 వ వార్డు సీనియర్ నాయకులు రాజ్జర్ ఖాన్ సమక్షంలో 100 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇంతియాజ్ పార్టీ కండువాలు కప్పి వారికి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల జీవితాల్లో మార్పులు రావాలంటే, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు.పేదల గురించి ఆలోచించే పార్టీ వైఎస్సార్ సీపీనే అన్నారు. ఐదేళ్ల చక్కని పాలన అందించిన వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, 12 వ వార్డు కార్పొరేటర్ క్రాంతికుమార్, పార్టీ నాయకులు చాట్ల నవీన్, పాటిల్ తిరుమలేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరిదేవికి సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకొస్తున్న తొగటవీర క్షత్రియ మహిళలు

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషన్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పడమటి కాలనీలో ఉన్న కలశ గది నుంచి అమ్మ వారికి తొగటవీర క్షత్రియులు, బ్రాహ్మణులు, కలశం, పుసుప, కుంకుమ, పూలు, గాజులు చీర, రవిక, బోనం, ఒడిబియ్యం తదితర పూజ వస్తువులను మేళతాళాలతో అమ్మ వారి ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. అనంతరం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన తదితర పూజలు చేసి తమ మొక్కుబడులు చెల్లించారు. సాయంత్రం ధర్మవరానికి చెందిన శ్రీ అభయహస్త సేవా సమితి వారు చేపట్టిన అన్నమయ్య సంకీర్తన భక్తులను అలరించింది.

సీతారాముల వారికి తిరుమంజన సేవ



స్వామివార్ల ఉత్సవ మూర్తులు



తలంబ్రాల సేవలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఈనెల 13వ తేదీన మున్సిపల్ ఎగ్జిబిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరంచుకొని గత రెండు రోజుల నుంచి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గోశాలలో తలంబ్రాలు, తిరుమంజన సేవ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. సమితి అధ్యక్షుడు కె.క్రిష్టన్న, ఉపాధ్యక్షుడు ఎస్వీ నారాయణరెడ్డి, మహాబలేష్, కార్యదర్శి ఎమ్.నాగోజీరావు, కోశాధికారి కల్కి మురళి, సంయుక్త కార్యదర్శులు ఎస్.నటేష్ కుమార్, గోపీనాథరావు, మల్లికార్జున, నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి



మాదిగల సింహగర్జన సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

- మాదిగల సింహగర్జన సభలో ఇంతియాజ్

కర్నూలు (టౌన్): బడుగు బలహీన వర్గాలకు అండగా ఉన్న వైఎస్ జగన్ సర్కారుకు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీఏఎస్ కల్యాణ మండపం సమావేశ హాలులో జైబీమ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జానయ్య మాదిగ ఆధ్వర్యంలో మాదిగల సింహగర్జన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంతియాజ్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడన్నారు. ఎటువంటి వసతులు లేని కాలంలో కష్టపడి చదివి ఎన్నో డిగ్రీలు సాధించి రాజ్యాంగ నిర్మాత అయ్యారన్నారు. తాను ఐఏఎస్ అధికారిని కావడానికి ఆయన్నే స్ఫూర్తిగా తీసుకున్నానన్నారు. తాను కృష్ణా జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర నడిబొడ్డున 124 అడుగుల ఎత్తు కలిగిని బాబా సాహెచ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పర్యాటక స్థలంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. తనకు ఎన్నికల్లో గెలిపిస్తే ఎంఆర్‌పీఎస్ డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్.మద్దయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకుందాం

కర్నూలు (టౌన్): ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు డాక్టర్ పెంచలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక నగరంలోని 142 నుంచి 159 పోలింగ్ స్టేషన్ల వరకు ఓటు హక్కు వినియోగం–ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక దామోదరం సంజీవయ్య స్కూల్ నుంచి కిడ్స్ వరల్డ్ సర్కిల్, ఉస్మానియా కళాశాల రోడ్డు, వడ్డెగేరి వీధి, ఖడక్‌పురా, రాధాక్రిష్ణ టాకీస్ మెయిన్ రోడ్డు మీదుగా కాంగ్రెస్ ఆఫీస్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటే పౌరుడికి విలువైన ఆయుధం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు స్వీప్ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీలు, కళాజాతాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల సిబ్బంది

ఇంటర్‌లో సత్తాచాటిన విద్యార్థులు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో నారాయణ కాలేజ్ డీజీఎం గోవర్ధన్ రెడ్డి, తదితరులు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎస్ఆర్ కాలేజీ జోనల్ ఇన్‌చార్జ్ రఘువీర్, తదితరులు



అత్యధిక మార్కులు సాధించిన వారితో శ్రీచైతన్య కాలేజ్ డీన్స్ బాలాజీ, సరళ

కర్నూలు (సిటీ): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను శుక్రవారం ఆయా కాలేజీల నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఎస్ఆర్ కాలేజీలో..

ఎస్ఆర్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ఆ కాలేజీ జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్ తెలిపారు. సీనియర్ ఎంపీసీలో పి.నేహ విరోనికా రెడ్డి 985 , తలారి అనిల్‌కుమార్ 981, ఈడిగ రుస్యాంతి 979, బైపీసీలో జె.సాయిసుష్మ 985, కార్తీక్ 960, బెస్త సాయి వెంకట్రామ్ 947 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీలో ఎం.ఎం మోహసీన్ 465, వై.లహరి 462, కట్టా అమృత 462, వై.నాగ మల్లేశ్వరి 461, రేగటి రుచిత 461, కురువ భరత్‌కుమార్ 461, కె.లతిక 460, ఎస్.నాగ హర్ష వర్ధిణి 460, వై.యశ్వసిని 460, డి.మహమ్మద్ కుల్లాయి 459, డి.ఉదయ్ వర్మ 456, డి.శివ రామకృష్ణ 455 మార్కులు, బైపీసీలో ఆర్.లిఖిత 432, పాలిశెట్టి యోగ అమృత 426, బి.టి తరుణ్ కుమార్ రెడ్డి 424 మార్కులు సాధించారన్నారు.

శ్రీచైతన్య కళాశాలలో..

శ్రీచైతన్య జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆ కాలేజీల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో ఆర్.సుమన్ 990 , మాదిరెడ్డి గారి సాయి తేజశ్వని 989, జి.మోనామృత 988, బైపీసీ విభాగంలో కె.ఎస్ తబసుమ్ 988 , ఆకుల నాగ భవ్య 987, బోయ జగదీష్ 983, జూనియర్ విభాగం ఎంపీసీలో త్రివేది షణ్ముక హాసిని 465, కానాల దత్త దరహాస్ 465, గొల్ల ప్రసాద్ 465, అంబటి స్ఫూర్తి 464, ముల్లా అఫ్రహ్ సానా 464, డి.యశ్వసిని 464, జి.కిరణ్‌కుమార్ రెడ్డి 464, డి.పవన్‌కుమార్ 464, బి.రాంప్రసాద్ 464 మార్కులు, బైపీసీలో మిరాజ్ ఇంతియాజ్ 434, జి.హిమవర్షిణి 434, సి.నిఖిల 433, కోల ప్రేమ్‌కుమార్ 433 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు సీనియర్ ఎంపీసీలో 990 మార్కులు ఒకరు, 989 ఇద్దరు, 985కిపైగా 9 మంది, 980కిపైగా 27 మంది, 950కిపైగా 270 మంది, 900 మార్కులకుపైగా 781 మంది, బైపీసీలో 988 మార్కులు ఒకరు, 985 ఇద్దరు, 980కిపైగా 6, 950కిపైగా 91 మంది, 900 మార్కులకుపైగా 232 మంది, జూనియర్ ఎంపీసీలో 465 మార్కులు ఇద్దరు, 464 మార్కులు 11, 461కిపైగా 61, 450కిపైగా 215, 400కిపైగా 1105, బైపీసీలో 434 ఇద్దరు, 433కిపైన 5, 430కిపైగా 20, 400కిపైగా 184 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఆ కాలేజీ డీన్స్ బాలాజీ, సరళ, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కాలేజీలో...

నారాయణ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ కాలేజ్ డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్‌లు ఆంజనేయరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. సీనియర్ బైపీసీ విభాగంలో జె.మృదుల 985, ఎ.కుందన సాయి 985, అసిఫా తయ్యబా 983, డి.లాస్య నందిని 982, షేక్ అసియా 982, 985కిపైగా ఇద్దరు, 980కిపైగా 8, 950కిపైగా 99 మంది, 900కిపైగా 262 మంది, ఎంపీసీ విభాగంలో చరిత 990, జి.యశస్విని 989, అఖున్ నైరా 989, జి.సమీర 989, సాయి నేహ 988తో పాటు 985 మార్కులకుపైగా 14, 980కిపైగా 43, 950కిపైగా 363 మంది, 900కిపైగా 978 మంది మార్కులు సాధించారన్నారు. జూనియర్ విభాగంలో ఎంపీసీలో షేక్ జోహ 466, ప్రహస 466తో పాటు 466 మార్కులు ఇద్దరు, 465కిపైగా 16 మంది, 463కి పైగా 57 మంది, 460కి పైగా 146, 450కి పైగా 431 మంది మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఆ కాలేజీ డీన్ నరసింహరావు, ప్రిన్సిపల్స్ వేణుగోపాల్ రెడ్డి, జయరామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, విజయ మోహన్, పి.సుజాత, సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య అకాడమీలో...

ఆచార్య ఐఐటీ, జేఈఈ నీట్ అకాడమికి చెందిన విద్యార్థులు ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఆ కాలేజీ డైరెక్టర్లు డా.ఎం.ఎల్ అనంత్, ఎస్.వి ప్రసాద్, జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్ శర్మ తెలిపారు. జూనియర్ బైపీసీలో పరిహా తాజీన్ 428 మార్కులు, ఎంపీసీలో నందిత 465 మార్కులు, సీనియర్ బైపీసీలో షేక్ మక్కా హుస్సేన్ 978 మార్కులు, ఎంపీసీలో మహిత 978 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు జూనియర్ విభాగం ఎంపీసీలో 463, 462, 461, 460, బైపీసీలో 427, 416 మార్కులు సాధించారన్నారు.

రవీంద్ర విద్యాసంస్థల్లో..

శ్రీకృష్ణ, రవీంద్ర జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. సీనియర్ బైపీసీ విభాగంలో సుమయ హఫ్స 985 మార్కులు, సన సమ్రీన్ 982, ఎంపీసీ విభాగంలో హిమచంద్ర 985 మార్కులు, కె.రాహీతి మేఘన 985, సాయి యశోద 984 మార్కులు, జూనియర్ ఎంపీసీ విభాగంలో రాజేశ్వరి 463, శివమనీషా 462, బైపీసీ విభాగంలో ఆర్షియా సుల్తానా 431 మార్కులు, బి.ఉషా రాణి 431 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

సృజనలో..

సృజన ఒకేషనల్ జూనియర్ కాలేజీ జూనియర్ ఇంటర్‌లో 81 శాతం , సీనియర్ ఇంటర్‌లో 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ కాలేజీ కరస్పాండెంట్ సునీల్ బేతపుడి తెలిపారు. జిల్లాలోనే అత్యధిక మంది ఒకేషనల్ విద్యార్థులు తమ కాలేజీలోనే ఉత్తర్ణులయ్యారని వెల్లడించారు. సీనియర్ ఇంటర్ నుంచి శైలజ 951/1000, జూనియర్ ఇంటర్ నుంచి ఎ.కుమారి 484/500 అత్యధిక మార్కులు సాధించారన్నారు.

మాస్టర్ మైండ్స్‌లో..

మాస్టర్ మైండ్స్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ఆ కాలేజీ బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, బ్రాంచ్ అకడమిక్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసమూర్తి తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎస్.అశ్రీత 484/500 , సీనియర్ ఇంటర్‌లో టి.త్రిపుర తన్మయి 982/1000 మార్కులు సాధించారన్నారు. మొత్తంగా ఎంఈసీ, సీఈసీ గ్రూపులు కలిసి 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు.

శ్రీమేథలో..

శ్రీమేథ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ఆ కాలేజీ కరస్పాండెంట్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో అలేఖ్య 459, జగదీష్ గుప్త 445, చంద్రశేఖర్ 431, అక్బర్ 416, చిన్ను 406, కాశీం రాజ్ 403, మూర్తి 396, బైపీసీ విభాగంలో చిన్న సురేంద్ర 407, సీఈసీలో నవాజ్ షరీఫ్ 442, సీనియర్ ఎంపీసీ విభాగంలో ఉదయ్ కిరణ్ 987, కె.మధు 929, రాజేష్ 897, నరసింహారెడ్డి 856, బైపీసీ విభాగంలో శ్రీనిత్య 911, ఉపేంద్ర 853, భాగ్యలక్ష్మి 852 మార్కులు సాధించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ఆచార్య కాలేజీ ప్రతినిధులు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో మాస్టర్ మైండ్స్ కాలేజీ ప్రిన్సిపాల్



శ్రీమేథ విద్యార్థులు మధు, ఉదయ్‌కిరణ్, శ్రీనిత్య



అలేఖ్య, జీగదీష్ గుప్త, నవాజ్ షరీఫ్

బాబును నమ్మి మోసపోవద్దు

- పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని



ఎన్నికల ప్రచారంలో అవ్వను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎన్నికలు దగ్గర పడటంతో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆపార్టీ నేతలు ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తారని, వాటిని నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 36వ వార్డులోని రాజీవ్‌గృహకల్ప కాలనీ, డ్రైవర్స్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా కాలనీ వాసులు ఘనంగా స్వాగతం పలికారు. కాలనీలో వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి తావులేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందించామన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం నవరత్నాలు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, పలువురు కార్పొరేటర్లు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఉపకులపతి శారదా జయలక్ష్మి

నంద్యాల(సెంట్రల్):ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నూతన సాంకేతికతను అభివృద్ధి పరచడంలో, సాగుకు సంబంధించి కొత్త ఆవిష్కరణలు రూపొందించే విధంగా కృషి చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాయం ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం పరిశోధన స్థానం సమావేశ మందిరంలో సహసంచాలకురాలు సరళమ్మ అధ్యక్షతన శాస్త్రవేత్తలతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో పరిశోధనల్లో రాబట్టిన ఫలితాలను, సాధించిన ప్రగతిని ఆమెకు వివరించారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ... పరిశోధనల పరంగా విశ్వవిద్యాలయాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు తగిన ప్రణాళికలు రచించుకోవాలని, పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరే విధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఓటు వేయడం మన బాధ్యత

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు కల్చరల్: ఓటు వేయడం హక్కే కాదు బాధ్యత కూడా అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్, కర్నూలు రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా 'నేను తప్పక ఓటు వేస్తాను' అనే స్లోగన్‌తో పాటు మోడల్ ఈవీఎమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటు విలువ గురించి తెలిసిన వారు ఇంట్లో కూర్చోరాదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.తర్వాత 'నేను ఓటు వేస్తాను' అనే ప్రతిజ్ఞకు సంబంధించిన సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డును కలెక్టర్ ఆవిష్కరించి సంతకం చేశారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే ఎయిర్ బెలూన్‌ను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి ఎగుర వేశారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని సూచిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, కమిషనర్

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) MAHINDRA ALFA DX DIESEL BS VI 2021 MODEL AP39 UA 9692
2) APE XTRA LDX+ PU DIESEL BS6 2022 MODEL AP39 UF 0964
Cell : 97039 74853
D. No: 62-65, 1st Floor, SV Complex, R S Road, KURNOOL.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
90108 25556
Office mail : sakshiknladvt@gmail.com